క్లుప్తంగా

ఎన్నికల నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్యామ్‌సుందర్

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికల వేళ ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించాలని ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్ అన్నారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమీక్షించారు. ఎన్నికలలో ప్రచారం, ఫ్లెక్సీల ఏర్పాటు, ఖర్చులకు సంబంధించిన నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యా రెడ్డి, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, వైఎస్సార్ సీపీ నుంచి మద్దాలి శ్రీను, పాగా సురేష్ కుమార్, సంగినీడి భవన్నారాయణ, బీజేపీ నుంచి ఏడు కొండలు, పెన్నాడ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత ఎన్నికలకు సహకరించాలి



పెద్దాపురం పురవీధుల్లో పోలీస్ కవాతు నిర్వహిస్తున్న సిబ్బంది

పెద్దాపురం: స్వేచ్ఛాయుత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు గ్రామీణ ప్రజలు సహకరించాలని సీఐ రవికుమార్ అన్నారు. త్వరలో ఎన్నికల కోడ్ అమలు కానున్న నేపథ్యంలో బుధవారం పెద్దాపురం పట్టణంలో ఎస్‌ఐ వెలుగుల సురేష్ ఆధ్వర్యంలో పోలీస్ కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణపై పూర్తి అవగాహన అవసరమన్నారు. కోడ్ అమలులోకి రాగానే పోలీస్ యంత్రాంగం చేపట్టే విధివిధానాలకు ప్రజలు సహకరించాలన్నారు. ప్రశాంత వాతవారణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరి సహకారం ఎంతో అవసరమన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని వీధుల్లో పోలీస్, బెటాలియన్ సిబ్బంది కవాతు నిర్వహించారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి



ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న డీఈఓ రమేష్

సామర్లకోట: విద్యార్థులు ఆరో తరగతి నుంచే ఆంగ్లం, హిందీ భాషలపై పట్టు సాధించేలా చూడాలని డీఈఓ పి.రమేష్ అన్నారు. బుధవారం స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేసి 9వ తరగతి విద్యార్థులతో ట్యాబ్‌ల వినియోగంపై సమీక్షించారు. ట్యాబ్‌లలో సాంకేతిక లోపాలను సవరించాలని హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణకు సూచించారు. పాఠశాల పీఎం ఎక్సలెన్స్ అవార్డు పోటీల్లో ఉన్న దృష్ట్యా అన్ని అంశాలపై మరింత శ్రద్ధ చూపాలన్నారు. 10వ తరగతిలో ప్రతీ విద్యార్థి గ్రేడ్–ఎ లక్ష్యంగా సాధన చేయాలన్నారు. నాడు–నేడు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 పి. పుల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాక్‌లో నల్ జల్ మిత్రలకు అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న మహిళా ప్రతినిధులు

సామర్లకోట: స్థానిక నాక్ శిక్షణ కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ పథకం జల్ జీవన్ మిషన్‌లో జిల్లాలోని మహిళా సంఘాల ప్రతినిధులను నల్ జల్ మిత్రలుగా గుర్తించి బుధవారం ఒక రోజు శిక్షణ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నాక్ ప్రైవేటు సంస్థ గృహ నిర్మాణ రంగంలోని వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. దీనిలో భాగంగా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు జిల్లాలోని జల్ వితరణ్ సంచాలక్‌లను నీటి పంపిణీ నిర్వాహకులుగా రూపొందించేందుకు అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా నీటి సంఘాల నుంచి 30 మంది మహిళా ప్రతినిధులు హాజరయ్యారు. వారికి నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్ (నాక్) అసిస్టెంట్ డైరెక్టరు జె.రాజు, ఉమ్మడి జిల్లా నాక్ జోనల్ అధికారి హరిశేషు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ స్వర్ణలత, జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టు మేనేజరు హనుమాన్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్కొట్టుడు

- పంటకు మూషికాల బెడద
- అన్నదాతకు అధిక వ్యయం
- దిగుబడిపై ప్రభావం పడే అవకాశం
- ఆందోళన చెందుతున్న రైతులు



ఎలుకల నిర్మూలనకు పొలాల్లో బుట్టలు అమరుస్తున్న రైతు

పెద్దాపురం: గోరుచుట్టుపై రోకలి పోటు అన్న చందంగా ఉంది నియోజకవర్గంలోని రైతుల పరిస్థితి. ఈ దాళ్వాలో రైతులకు అవసరమైన సమయంలో కాకుండా వర్షాలు పడకూడదన్న సమయాల్లోనే వర్షాలు పడిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో కొన్ని చోట్ల నారుకొరత ఏర్పడింది. దీన్ని అధిగమించేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు. వరి చేలు ఇప్పుడిప్పుడే మొలకలు వచ్చి దుబ్బులు ఏర్పడుతున్న సమయంలో ఎలుకలు దాడి మొదలుపెట్టాయి. రసాయన మందులు వాడినా ఎలుకల నిర్మూలన సాధ్యం కాకపోవడంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

నివారణ చర్యలు చేపడుతున్నా...:

ఎలుకల నివారణకు వరి నూకల్లో రసాయన మందు కలిపి పొట్లాలు కట్టి బుట్టలను ఉంచుతున్నా ప్రయోజనం ఉండడం లేదని రైతులు చెప్తున్నారు. ప్రస్తుతం ఎలుకల నివారణకు బుట్టలు ఉపయోగించడం, పొగ పెట్టడం వంటి నివారణ చర్యలు తీసుకుంటున్నారు. బుట్టలు పెట్టే విధానంలో ఎరగా ఉంచిన ధాన్యం గింజలు తినడానికి వచ్చిన ఎలుక ప్రత్యేకంగా అమర్చరిన వెదురు కర్రల మధ్య చిక్కుకుని మరణిస్తుంది. పొగపొట్టే పద్ధతిలో ఎలుకలు తిరగాడే ప్రాంతాన్ని గుర్తించి అక్కడ కొంత మేర తవ్వి, కుండలో గడ్డి ఉంచి, నిప్పు పెట్టి పొగవచ్చేలా చేసి కన్నం వద్ద ఉంచుతారు. ఆ పొగకు కన్నంలో ఉన్న ఎలుక ఊపిరాడక చనిపోతుంది. ఈ విధానం ద్వారా ఒక్కో ఎలుకకు, రూ.60 చొప్పున తీసుకుంటారు. నియోజకవర్గంలో గ్రామాల్లో ఎలుకలు పట్టే వారికి మంచి డిమాండ్ ఉంది. ఎకరానికి రెండు, మూడు వేల రూపాయల వరకు ఎలుకలను పట్టేందుకు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ఈ ప్రయత్నాలు కూడా అంతంతమాత్రమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎలుకలను పట్టేందుకు బుట్టలు సిద్ధం చేస్తున్న కార్మికుడు

పంట నాశనమవుతుంది..



ఎలుకల దాడికి గురైతే వరి పంట సర్వనాశనమవుతుంది. మార్కెట్లో దొరికే ఖరీదైన మందులు వాడినా అవి తినడం లేదు. ఎలుకలు వరి దుబ్బుల మొదలంతా కొరికిపారేయడంతో మొక్క పూర్తిగా చనిపోతుంది. ఫలితంగా ఎకరానికి సుమారు 10 బస్తాలు దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉంది.

– సుందరెడ్డి రాజు, కౌలురైతు, పులిమేరు, పెద్దాపురం మండలం

గుర్రపు డెక్క తొలగింపు



సామర్లకోట ఐదుతూముల వద్ద గోదావరి కాలువలో గుర్రపు డెక్కను మెషీన్‌తో తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: గోదావరి కాలువలో పెరిగిపోయిన తూటి కాడ, గుర్రపు డెక్కల తొలగింపును ఇరిగేషన్ అధికారులు వేగవంతం చేశారు. హుస్సేన్‌పురం నుంచి మాండవ్య నారాయణస్వామి కాలిబాట వంతెన, ఐదు తూముల వద్ద గుర్రపు డెక్క తొలగింపు ప్రారంభించారు. గత నెలలో గోదావరి కాలువలో పెరిగిపోయిన గుర్రపు డెక్క అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దిగువ ప్రాంత భూములకు సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడుతుండడంతో అధికారులు ఈ చర్యలకు శ్రీకారం చుట్టారు. దీనికి తోడు మహాశివరాత్రి తరువాత గోదావరి కాలువలో నీటి మట్టం పెరగడంతో సాగునీటికి ఎటువంటి ఇబ్బంది ఉండదని డీఈఈ నాగేశ్వరరావు తెలిపారు. గుర్రపు డెక్క తొలగింపుతో పంట కాలువలోకి నీరు వస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి దాదాపు వరి పంట చేతికి వచ్చే అవకాశం ఉంది.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత
- ముమ్మిడివారిపోడులో సీసీ రోడ్లకు శంకుస్థాపన



ముమ్మిడివారిపోడులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ గీత

కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత అన్నారు. మండలంలోని శ్రీరాంపురం శివారు ముమ్మిడివారిపోడులో అరబిందో ఫార్మా ఫౌండేషన్ నిధులు రూ.కోటితో నిర్మించే సీసీ రోడ్లకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వాలు కేఎస్‌ఈజెడ్ బాధిత రైతులను అన్నివిధాలా మోసం చేశాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వం కేఎస్‌ఈజెడ్ రైతులపై అక్రమ కేసులు పెట్టిందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కేఎస్ఈజెడ్ బాధిత రైతులపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఎస్ఈజెడ్‌ల పేరుతో తీసుకున్న భూముల్లో సుమారు 2200 ఎకరాలను తిరిగి రైతులకు అప్పగించడమే కాకుండా 4 గ్రామాలను కేఎస్ఈజెడ్ నుంచి మినహాయించారని తెలిపారు. నియోజకవర్గంలోని 63 సచివాలయాలకు గతంలో మంజూరు చేసిన రూ.20 లక్షలే కాకుండా గ్రామాల మరింత అభివృద్ధికి మరో రూ.20 లక్షల చొప్పున సుమారు రూ.12.60 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించుకోవచ్చన్నారు. అలాగే శ్రీరాంపురం, ముమ్మిడివారిపోడు గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి రమేష్, వైస్ ఎంపీపీ మదిరెడ్డి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిమాండ్లపై చిత్తశుద్ధిలేదు

సామర్లకోట: కేంద్ర ప్రభుత్వానికి మహిళా డిమాండ్లపై చిత్తశుద్ధి లేదని అంగన్‌వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.భద్రావతి అన్నారు. స్థానిక సీఐటీయూ భవన్‌లో బుధవారం మహిళా దినోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. దేశంలో శ్రమ దోపిడీ జరుగతుందన్నారు. కేంద్రంలో బీజేపీ అగ్రవర్ణాలు, పారిశ్రామిక, పెత్తందారులకు అండగా ఉంటుందని ఆరోపించారు. మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ సంఘ నాయకులు దాడి బేబి, టి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

కొత్తపల్లి: మండలంలోని గోర్సలో బుధవారం పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ రొంగల వీరబాబు ఆధ్వర్యంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను అందజేశారు. పలువురు సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రెగ్యులర్ వందే భారత్ రైలుకు స్వాగతం



వందే భారత్ రైలు మేనేజరు ప్రభాకర్‌ను సత్కరించిన స్టేషన్ మేనేజరు రమేష్

సామర్లకోట: బుధవారం నుంచి నిత్యం నడిచే విశాఖపట్నం–సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు సామర్లకోట స్టేషన్‌లో స్వాగతం పలికారు. రైలు లోకోపైలెట్ ఆర్‌ఎస్‌జీ బాబు, రైలు మేనేజరు డి.ప్రభాకర్ (గార్డు)లను రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ ఆధ్వర్యంలో సత్కరించారు. సామర్లకోట నుంచి సికింద్రాబాద్‌కు 47 మంది మొదటి రోజునే ప్రయాణం చేసినట్టు రమేష్ తెలిపారు. సామర్లకోట నుంచి సాయంత్రం 4.15కు బయలుదేరిన రైలు సికింద్రాబాద్‌కు రాత్రి 11.20 కి చేరుతుందని చెప్పారు. రైలుకు స్వాగతం చెప్పిన వారిలో చీఫ్ టిక్కెటు ఇన్‌స్పెక్టరు కేవీ గిరి, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజరు మూర్తి, హెల్త్ ఇన్‌స్పెక్టరు కల్యాణి ఉన్నారు.

ఇంటర్ పరీక్షలకు 10 మంది గైర్హాజరు

కొత్తపల్లి: స్థానిక వీవీఎస్ కళాశాలలో బుధవారం జరిగిన ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలకు 10 విద్యార్థులు గైర్హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ జి.సూర్యనారాయణ తెలిపారు. మొత్తం 193 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావల్సి ఉండగా 183 మంది విద్యార్థులు పరీక్షలు హాజరైనట్టు వివరించారు.

ఎంసీసీపై అవగాహన అవసరం



ఎంసీసీపై ప్రజాప్రతినిధులకు వివరిస్తున్న ఎంపీడీఓ, కమిషనర్

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ)పై మరింత అవగాహన ఏర్పర్చుకోవాలని ఎంసీసీ కన్వీనర్లు పెద్దాపురం ఎంపీడీఓ జి.ఉషారాణి, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంసీసీపై వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఎన్నికల నియమావళిని అన్ని పార్టీలు అమలు చేయాలన్నారు. ఏ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, వాల్ పోస్టర్లు ఉండడానికి వీలు లేదన్నారు. ఆయా పార్టీల ప్రతినిధులే వాటిని స్వయంగా తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్, కార్యాలయ సూపరింటెండెంట్ సత్యనారాయణమూర్తి, గవరసాని సూరిబాబు (వైఎస్సార్ సీపీ) బచ్చల రాజు (వైఎస్సార్ సీపీ) లక్కాకుల కృష్ణ (వైఎస్సార్ సీపీ) డి.క్రాంతికుమార్ (సీపీఎం) సిరిపురపు శ్రీనివాస్ (సీపీఎం) పాలమరశెట్టి సత్తిబాబు (జనసేన), పువ్వల కృష్ణ (కాంగ్రెస్) పాల్గొన్నారు.

తాగు, సాగునీటికి ప్రభుత్వ ప్రాధాన్యం



సీబీదేవంలో తాగునీటి సరఫరాను ప్రారంభిస్తున్న దొరబాబు

పెద్దాపురం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తాగు, సాగు నీటి సరఫరాకు ప్రాధాన్యమిస్తోందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని చినబ్రహ్మదేవం గ్రామంలో జల్ జీవన్ మిషన్ నిధుల కింద సుమారు రూ.34 లక్షలతో చేపట్టిన తాగునీటి సరఫరా పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ కంచుమర్తి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని మెట్ట గ్రామాల్లో దాహార్తిని తీర్చేందుకు సత్వర చర్యలు చేపడుతున్నామన్నారు. రానున్న వేసవి దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా మెట్ట గ్రామాల్లో నీటి ఎద్దడి ఎక్కువ ఉన్నందున వాటి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని దొరబాబు సూచించారు. అనంతరం గ్రామంలో మంచీనీటి సరఫరాను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, పరిమి శ్రీను, నల్లల నాగేంద్రబాబు తదితరులు ఉన్నారు.

పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న మున్సిపల్ ఆర్డీ సత్యనారాయణ

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో ఇంటి, కుళాయి, ఖాళీ స్థలం పన్నులను 100 శాతం వసూలు చేయాలని మున్సిపల్ ఆర్డీ ఎన్‌వీవీ సత్యనారాయణ ఆదేశించారు. బుధవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో మున్సిపల్ రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రతీ రెండు వార్డులకు ఒక సచివాలయం ఉన్నా పన్నుల వసూలు మందకొడిగా సాగడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బందిని పూర్తి స్థాయిలో వినియోగించుకొని మొండి బకాయి దారులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెలాఖరు నాటికి పన్నులు చెల్లించిన వారికి వడ్డీ రాయితీ ఇస్తుందని, ఈ విషయాన్ని వినియోగదారులకు తెలియజేయాలన్నారు. మున్సిపల్ షాపుల బకాయిలు కూడా ఎక్కువగా ఉండటంపై రెవెన్యూ అధికారుల పని తీరును ఆయన తప్పు పట్టారు. నిత్యం లక్ష్యాలు నిర్ణయించుకుని వసూళ్లు వేగవంతం చేయాలని కమిషనర్ రామారావుకు సూచించారు. మున్సిపల్ కౌన్సిల్ సహకారం లేక పోవడం వలన బకాయిలు పెరిగి పోతున్నాయని రెవెన్యూ అధికారులు ఆర్డీ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి ప్రసాదరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు సురేంద్రకుమార్, బిల్లు కలెక్టర్లు, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: స్థానిక మున్సిపాలిటీలో బుధవారం సాయంత్రం మున్సిపల్ ఆర్డీ ఎన్‌వీవీ సత్యనారాయణ ఇంటి పన్నుల వసూళ్లపై అధికారులతో సమీక్షించారు. జీవో 35పై ప్రజలకు అవగాహన కల్పించి ఇంటి పన్నులపై వడ్డీ రాయితీపై వివరించాలన్నారు. సమావేశంలో మున్సిపాల్ కమీషనర్ పద్మావతి, ఆర్వో చంద్రశేఖర్, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- నూరుశాతం హామీల అమలు ఘనత జగన్‌దే
- నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి
- లబ్ధిదారులకు ఇంటిపట్టాల పంపిణీ



పులిమేరులో లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న దొరబాబు, కిశోర్

పెద్దాపురం: గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసి అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. బుధవారం మండలంలోని జె.తిమ్మాపురం, కట్టమూరు, దివిలి, పులిమేరు, చదలాడ, వడ్లమూరు గ్రామాల్లో అందరికీ ఇళ్లు పథకంలో మంజూరైన రిజిస్ట్రేషన్ పట్టాలను జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, నియోజవర్గ పరిశీలకులు చీకట్ల కిశోర్‌లతో కలిసి పంపిణీ చేశారు. ఈ పథకం కింద ఇచ్చే పట్టాలకు విలువ లేదన్న ప్రతిపక్షాల విమర్శలకు దీటుగా వాటికి రిజిస్ట్రేషన్ చేయించి సొంత ఆస్తిపై సర్వ హక్కులు కల్పించి అందజేస్తున్నారని దవులూరి అన్నారు. అలాగే పేదలందికీ ఇచ్చిన స్థలాలకు ఎదురుగా ఉన్న ఆదిత్య కళాశాల ఇప్పుడు యూనివర్సిటీ కావడంతో నేడు ఆ స్థలాలు లక్షలు పెట్టినా కొనలేని ఆస్తిగా మారిందంటే అది సీఎం జగన్ చలవేనని ఆయన అన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని దొరబాబు కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, చల్లా చిన వీర్రాజు, పెంటా విజయ్‌కుమార్, నల్లల గోవిందు, మేడిద వెంకట రామారావు, తుమ్మల అచ్యుతరామయ్య, సుందరెడ్డి రాజు, బోనాసు గుర్రాజు తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

- కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వంగా గీత
- తాటిపర్తిలో కొవ్వొత్తుల ర్యాలీ



తాటిపర్తిలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న కాకినాడ ఎంపీ వంగా గీత, నాయకులు

పిఠాపురం: టీడీపీ, జనసేన సోషల్ మీడియా వేధింపుల కారణంగా మృతి చెందిన గీతాంజలి కేసులో నిదింతులను కఠినంగా శిక్షించాలని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ వంగా గీత డిమాండ్ చేశారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో బుధవారం రాత్రి గీతాంజలి మృతికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గీతాంజలి మృతిని టీడీపీ, జనసేన సోషల్ మీడియా మూకలు చేసిన దారుణ హత్యగా పరిగణించాలన్నారు. గీతాంజలి ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. దోషులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉలవకాయల నాగ లోవరాజు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, వైఎస్సార్ సీపీ నేతలు దాసం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

డీపీఓ భారతీ సౌజన్య



నాగులాపల్లిలో తాగునీటి నివారణపై అధికారులతో చర్చిస్తుడీపీఓ భారతీ సౌజన్య

కొత్తపల్లి: వచ్చే వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య అన్నారు. మండల పరిధిలోని గ్రామాల్లో తాగునీరు సక్రమంగా అందడం లేదని, పబ్లిక్ కుళాయిల ద్వారా కలుషితమైన నీరు సరఫరా అవుతోందని జిల్లా కలెక్టర్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు వాకతిప్పలోని నాగులాపల్లి ఏరియా రక్షిత తాగునీటి పథకాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. తొలుత కొమరగిరి శివారు నాగంపేట, ఆనంద్‌నగర్, వెంకటరాయపురం, చిన్నకలవలదొడ్డిలోని ప్రధాన పైపులైన్లనుశీలించి తాటి సమస్యలపై స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాగులాపల్లి గ్రామ సర్పంచ్‌ను వివరణ కోరగా ఆమె చెక్ పవర్ రద్దు చేయడంతో సమాధానం చెప్పడానికి నిరాకరించారు. ఆమె వెంట ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు ఉన్నారు.